నాగమ్మా.. కరుణించమ్మా!

ఘనంగా నాగుల చవితి వేడుకలు

నాగుల చవితి వేడుకలను శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జాము నుంచే భక్తులు ఆయా ప్రాంతాల్లోని పుట్టలు, దేవాలయాల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలో పాలు పోసి నాగమ్మా.. కరుణించమ్మా, సల్లంగా చూడమ్మా అంటూ నాగ దేవతలను పూజించారు. అనంతరం చలిమిడి, అరటిపండ్లు, వడపప్పు వంటి ఆహారాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడాయి. – సాక్షి నెట్‌వర్క్



కూసుమంచి: జీళ్లచెరువులోని ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



రఘునాథపాలెం: నాగమ్మ తల్లి దేవాలయం వద్ద భక్తుల సందడి



ఖమ్మంగాంధీచౌక్: డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నేలకొండపల్లి: పుట్టలో పాలు పోస్తున్న అయ్యప్ప మాలధారులు

అభివృద్ధి కోసం మరోమారు ఆశీర్వదించండి..



పీఎస్‌ఆర్ రోడ్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న పువ్వాడ వసంతలక్ష్మి



రఘునాథపాలెం: రోడ్‌షోలో మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్

ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం/ఖమ్మంమయూరిసెంటర్: కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మరోమారు ఆశీర్వదిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో, నగరంలోని 11వ డివిజన్ రోడ్‌షో, మార్కెట్ మజీద్ వద్ద ముస్లింలను ఓట్లు అభ్యర్థించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖమ్మం నగర అభివృద్ధిని అడ్డుకోవడానికే గతంలో ఖమ్మం, పాలేరులో ఓడిపోయి ఇప్పుడు మళ్లీ ఖమ్మం నుంచి పోటీ చేయడానికి వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు వచ్చాడని, అతడు తెగిన గాలి పటం లాంటి వాడని ఎద్దేవా చేశారు. ఎన్నికలు రాగానే వస్తారు.. అబద్ధాలు, ఆరోపణలు, రకరకాల విష ప్రచారాలు చేసి మనల్ని ఆగం ఆగం చేస్తారని చెప్పారు. ఇంకా ఖమ్మం చాలా అభివృద్ధి జరగాల్సి ఉందని, ఈ అభివృద్ధి కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు చిరుమామిళ్ల లక్ష్మీనాగేశ్వరరావు, సరిపుడి రమాసతీశ్, కర్నాటి క్రిష్ణ, బచ్చు విజయ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు అజ్మీరా వీరునాయక్, కూరాకుల నాగభూషణం, జెడ్పీటీసీ ప్రియాంక, సర్వార్, సలీం, ఖమర్, తాజుద్దీన్, తౌసిఫ్, గఫూర్, ఆసిఫ్, హమీద్, ఫరూక్, తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడ సమక్షంలో చేరిక..

సీపీఎం హవేలి కమిటీ మాజీ కార్యదర్శి సీనియర్ నాయకుడు కోదాటి గిరి శుక్రవారం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అనంతరం గిరితో పాటు వారు అనుచరులు కవిరాజ్‌నగర్‌లో జరిగిన భారీ ర్యాలీలో బీఆర్ఎస్‌లో చేరారు.

త్రీటౌన్‌లో వసంతలక్ష్మి ఇంటింటి ప్రచారం..

కారు గుర్తుపై ఓటు వేసి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి పువ్వాడ వసంతలక్ష్మి త్రీటౌన్‌లో ఇంటింటి అమలు చేయబోయే పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. అలాగే రఘునాథపాలెంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం చేసి ఓట్లు అభ్యర్థించారు.

క్లుప్తంగా

అదంతా తప్పుడు ప్రచారమే..

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధి చేశామని బీఆర్‌ఎస్ నేతలు చేస్తున్నదంతా తప్పుడు ప్రచారమేనని నేలకొండపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ తెలిపారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంతో అభివృద్ధి చేసినా కరోనాతో నెమ్మదించిన చెబుతున్న బీఆర్‌ఎస్ నేతలు, ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ప్రకటించిన నిధులు ఏమయ్యాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు నెల్లూరి భద్రయ్య, వెన్నపూసల సీతారాములు, మామిడి వెంకన్న, బచ్చలకూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గెలిచేది మేమే..



మాట్లాడుతున్న ఆరిఫ్ నసీం ఖాన్

ఖమ్మంవన్‌టౌన్: గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఖమ్మం పార్లమెంట్ ఎలక్షన్ అబ్జర్వర్, మహారాష్ట్ర మాజీ హోం మంత్రి ఆరిఫ్ నసీం ఖాన్ అన్నారు. శుక్రవారం నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఖమ్మం డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, కమర్తపు మురళి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ జావీద్‌లు మాట్లాడుతూ.. కొనడం, అమ్ముడుపోవడం కాంగ్రెస్ సంస్కృతి కాదన్నారు. ఈ సమావేశంలో నాగండ్ల దీపక్ చౌదరి, మిక్కిలినేని నరేందర్, ముస్తఫా, నాగుల్‌మీరా, ముక్తార్, పీసీసీ సభ్యుడు పుచ్చకాయల వీరభద్రం, కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, సైదులునాయక్, రఫీదాబేగం, జాన్‌బీ, హుస్సేన్, శేఖర్‌గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, నారాయణరావు, సైదుబాబు తదితరులు పాల్గొన్నారు.

దొరల పాలనకు చరమగీతం పాడాలి..



ఖమ్మంరూరల్: మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి



నేలకొండపల్లి: కోనాయిగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రసాదరెడ్డి

ఎన్నికల ప్రచారల్లో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: దొరల దోపిడీ పాలనకు చరమగీతం పాడి, ఇందిరామ్మ రాజ్యస్థాపనకు కదిలిరావాలని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఆరేకోడు, ఆరేకోడు తండాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఆనాడు ఉద్యమం చేశామని చెబుతున్న సీఎం కేసీఆర్, అనంతర కాలంలో ప్రజలను విస్మరించి సంపాదనే అజెండాగా పెట్టుకున్నాడని విమర్శించారు. తెలంగాణ వస్తే తమకు ఉద్యోగాలు వస్తాయనుకున్న ఏ ఒక్క నిరుద్యోగికి ఉద్యోగాలు రాలేదని, కేసీఆర్ కుటుంబంలో మాత్రం ఆరు ఉద్యోగాలు సంపాదించుకున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ తరపున గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ఇప్పటి వరకు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంతోనే ప్రజలందరి సమస్యలు పరిష్కారం అవుతాయని, హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దండి సురేశ్, ఎండీ మౌలానా, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి విజయం కోరుతూ..

కూసుమంచి/ నేలకొండపల్లి: పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డితో పాటు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో, నేలకొండపల్లి మండలం కోనాయిగూడెంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి, ఇతర నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈనేపథ్యాన కోనాయిగూడెంలో పంచాయతీ వార్డు సభ్యురాలు మేకల ఉపేంద్రమ్మ దంపతులు, సీపీఎం నాయకుడు కొండపల్లి శేషయ్య, బీఆర్‌ఎస్ నాయకులు ఇమ్మడి సైదులు, కస్తాల నాగరాజు తదితరులు ప్రసాదరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ వజ్జా రమ్య, మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు, ఎంపీటీసీలు రేగూరి వాసవి, మాదాసు ఉపేందర్, సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, కాంగ్రెస్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కోర్టులో కరపత్రాల ఆవిష్కరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెల 19న నగరంలోని ఓయాసిస్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన 'తెలంగాణ రాష్ట్ర ఎన్నికలు – మన కర్తవ్యాలు'అనే అంశంపై నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కోర్టులో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎందరో విద్యార్థుల ఆత్మ బలిదానాలతో నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణను రూ.5 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఉదయం 10 గంటలకు జరిగే సదస్సుకు ముఖ్య వక్తలుగా టీపీజేఏసీ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీజేఏసీ జిల్లా కన్వీనర్ దేవిరెడ్డి విజయ్, కోకన్వీనర్ టి.వేణు, న్యాయవాదులు మీసాల వెంకటేశ్వర్లు, రాము, తేళ్లూరి వెంకట్, శ్రీనివాస్, నరేందర్, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, న్యాయవాదులు

కేయూ కబడ్డీ జట్టుకు 'డీఆర్‌ఎస్' విద్యార్థిని

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని డీఆర్‌ఎస్ కళాశాలకు చెందిన కె.శ్రావణి కాకతీయ యూనివర్సిటీ(కేయూ) మహిళ కబడ్డీ జట్టుకు ఎంపికైంది. ఈనెల 15, 16 తేదీల్లో వరంగల్‌లో జరిగిన ఈ ఎంపికల్లో విద్యార్థిని ప్రతిభ చాటగా.. తమిళనాడులోని అళగప్ప యూనివర్సిటీ నిర్వహించే దక్షిణ భారత యూనివర్సిటీ మహిళల కబడ్డీ టోర్నీలో పాల్గొనుంది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వి.మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ వి.శోభరెడ్డి, ప్రిన్సిపాల్ టి.నాగేశ్వరరావు, ఏఓ వెంకటకృష్ణలు అభినందనలు తెలిపారు.



శ్రావణిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

హోరెత్తిన ఎన్నికల ప్రచారం

ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపాలి..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు డివిజన్లలో సీపీఎం ఖమ్మం అభ్యర్థి యర్రా శ్రీకాంత్ పర్యటించి ప్రముఖుల మద్దతు కోరుతూ జిల్లా కోర్టు, షాపింగ్ మాల్స్‌లలో విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపాలని కోరారు. కాగా నగర ప్రముఖుడు ఆకుల గాంధీ తన సంపూర్ణ మద్దతు శ్రీకాంత్‌కు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, ఐలు రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి మందడపు శ్రీనివాసరావుతో పాటు యర్రా శ్రీనివాసరావు, బండారు యాకయ్య, చింతల రమేశ్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

కామేపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని ఇల్లెందు సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి దుగ్గి కృష్ణ అన్నారు. శుక్రవారం కామేపల్లి మండలంలో ముమ్మర ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు యింజం నాగభూషణం, కాటినేని కృష్ణమూర్తి, బాగం రామారావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలు అందించాకే రాజకీయాల నుంచి తప్పుకుంటా..

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంఅర్బన్: గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే నా ముందున్న ఏకైక లక్ష్యమని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వారరావు అన్నారు. శుక్రవారం నగరంలోని 6,7, 43 డివిజన్లలో విస్తృతంగా పర్యటించి హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జావీద్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జన బలానికి, ధన బలానికి మధ్య పోటీ..

నేలకొండపల్లి/కూసుమంచి/తిరుమలాయపాలెం: పాలేరు నియోజకవర్గంలో జన బలం ఉన్న తమకు, ధన బలం ఉన్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌కు మధ్యనే పోటీ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం అన్నారు. శుక్రవారం నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రచారాల్లో పార్టీ నాయకులు బండి రమేశ్, కే.వీ.రెడ్డి, బుగ్గవీటి సరళ, ఎడవెల్లి రమణారెడ్డి, గురుమూర్తి, వెల్లంపల్లి అశోక్, మల్లెల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, తిరుమలాయపాలెం మండలంలోని పాపాయిగూడెం గ్రామానికి చెందిన రేపాకుల రాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా తమ్మినేని వీరభద్రం నివాళులర్పించి కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

బహుజన రాజ్యాధికారమే ధ్యేయం..

ఖమ్మం రాపర్తినగర్: బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) కృషి చేస్తుందని ఖమ్మం అసెంబ్లీ అభ్యర్థి అయితగాని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం పెవిలియన్ గ్రౌండ్‌లో యువ క్రీడాకారులను కలిసి ఈ ఎన్నికల్లో తనకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

బలహీన వర్గాలకు మోదీ పెద్దపీట..

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంరాపర్తినగర్: బడుగు, బలహీన వర్గాలకు ప్రధాని నరేంద్ర మోదీ పెద్దపీట వేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. బీజేపీ బలపర్చిన ఖమ్మం అభ్యర్థి రామకృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం రోడ్‌షోతో పాటు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గెంటెల విద్యాసాగర్, దొంగల సత్యనారాయణ, అల్లిక అంజయ్య, జిల్లా ఇన్‌చార్జ్ రమేశ్, కోటేశ్వరావు, దనియాకుల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార డోర్ స్టిక్కర్లు ఆవిష్కరణ..

ఖమ్మంఅర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను బలపరిచిన మహాసేన పాలేరు నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మంద సంజీవరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం నగరంలోని ఖానాపురం హవేలిలో గల జిల్లా ఆఫీస్‌లో సంజీవరావు ఎన్నికల ప్రచార డోర్ స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహాసేన ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ అధ్యక్షుడు ఎల్.జీవరత్నంతో పాటు యాతాకుల కోటేశ్వరరావు, జోసెఫ్ నాయక్, నందిపాటి అభిషేక్, వెంగళం ఇమ్మానుయేలు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే పేదల జీవితాల్లో వెలుగులు



పైనంపల్లిలో కందాళను ఆశీర్వదిస్తున్న మహిళలు



బీరోలులో మాట్లాడుతున్న కందాళ ఉపేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే, పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, మరోమారు సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పైనంపల్లి, జూపెడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గులాబీ జెండా నిరుపేదలకు అండగా నిలిచిందని, కేసీఆర్ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పేదలను ఆదుకోవాలని ప్రపంచంలో ఎక్కడా లేని పథకాలను రాష్ట్రంలో ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం అందించడంతో పాటు రూ.5లక్షల బీమా వర్తింపజేస్తామని కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి అసెంబ్లీకి పంపితే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి అగ్రస్థానంలో నిలుపుతానని హామీ ఇచ్చారు. కాగా, జూపెడ గ్రామంలో స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షులు జినక వెంకటేశ్వర్లు, మాట్టే యలేందర్, నిమ్మల నర్సింహారెడ్డితో పాటుగా 12 కుటుంబాలు కందాళ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు బాషబోయిన వీరన్న, దావా వేణు, నిమ్మల వెంకటరెడ్డి, శ్రీనివాస్, ఎంపీటీసీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కందాళ విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం..

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురంలో కందాళ ఉపేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఆయన కుమార్తె దీపిక ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

ఖమ్మం సహకారనగర్: జేఎన్‌టీయూ పరిధిలోని ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని ఎస్‌బీఐటీ విద్యాసంస్థల చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, శివ ప్రసాద్, ప్రవీణ్‌కుమార్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్ నాయకులు కొని పార్టీలోకి చేర్చుకున్నా.. ఆయా డివిజన్‌లలోని ప్రజలంతా బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. శుక్రవారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లతో కలిసి ఆమె మాట్లాడారు. డబ్బుల కోసం కార్పొరేటర్లు సంతలో పశువుల్లా అమ్ముడుపోతున్నారని, నిబద్ధత లేని కార్పొరేటర్లను ప్రజలు క్షమించరన్నారు. తమ నాయకుడు పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడని మాటలను డీప్ ఫేక్ వంటి సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సృష్టించడంతో పాటు ఇంకా కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి మారుతున్నారని ప్రచారం చేస్తూ.. కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు చేస్తుదని విమర్శించారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లంతా పువ్వాడ వైపే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలవడం ఖాయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, షేక్ మక్బూల్, పల్లా రోజ్ లీనా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్/ ఖమ్మంవ్యవసాయం: నగరంలోని మమత ఆస్పత్రి రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మమతరోడ్డు, వరదయ్యనగర్, గొల్లగూడెం, మధురానగర్, మమత ఆస్పత్రి ఏరియా తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. అలాగే నగరంలోని 33/11 ఎన్ఎస్‌పీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గట్టయ్య సెంటర్, ఖమ్మం బైపాస్ ప్రాంతం, ఎన్ఎస్‌పీ ఏరియా, వికలాంగుల కాలనీ, రమణగుట్ట, ఆర్టీఓ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–3 ఆపరేషన్స్ ఏఈ బి.తావుర్యా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖమ్మం టౌన్–1 పరిధిలో...

ఖమ్మం టౌన్–1 గాంధీచౌక్ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి సాయింత్రం 4 గంటల వరకు ఎమ్మార్వో ఆఫీస్ రోడ్, సాయిరాం థియేటర్ రోడ్, మోతీనగర్, బొక్కల గడ్డ, పంపింగ్‌వెల్, ఫిల్టర్‌బెడ్ రోడ్, పంపింగ్‌వెల్ రోడ్ ఆటోస్టాండ్, పెద్దమ్మ తల్లి గుడి, గాంధీచౌక్, పీఎస్‌ఆర్ రోడ్, సుందర్ మ్యాక్స్ థియేటర్ రోడ్, కన్యకా పరమేశ్వరీ గుడి లైన్, జహీర్‌పుర తండా, వెంకటలక్ష్మి టాకీస్ రోడ్, గాంధీనగర్, కొత్త సీతారాములు రోడ్, సుందరయ్యనగర్, పత్తి మార్కెట్ రోడ్డు, జహీర్‌పుర, బోస్‌బొమ్మ సెంటర్, మంచికంటినగర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని ఏఈ మాల్విక ఒక ప్రకటనలో తెలిపారు.

ఖమ్మం టౌన్–5 పరిధిలో...

ఖమ్మం టౌన్–5 రామాలయం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ లైన్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కమాన్ బజార్, కస్బా బజార్, వల్లాల వారి వీధి, షాదీఖానా ఏరియా, స్టేషన్ రోడ్, బొమ్మనా సెంటర్, శాంతి లాడ్జ్ ఏరియా, వినోదా థియేటర్ ఏరియా, ఓల్డ్ మున్సిపాలిటీ కార్యాలయం ప్రాంతం, ఖిల్లా, శుక్రవారపు పేట, బ్రాహ్మణ బజార్, రిక్కా బజార్, చర్చి కాంపౌండ్, రామకృష్ణానగర్, సుగ్గలవారి తోట, మేదరి బజార్, అమ్మ భవాని టెంపుల్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ తెలిపారు.

నగరంలో సినిమాలు

తిరుమల	టైగర్ 3
వినోద	భగవంత్ కేసరి
సాయిరాం	సప్త సాగరాలు దాటి
ఆదిత్య	మా ఊరి పొలిమేర 2
శ్రీనివాస	జిగర్‌తండా డబుల ఎక్స్
సుందర్	స్పార్క్ ఎల్.ఐ.ఎఫ్.ఈ

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	36	బచ్చలికూర	3
వంకాయ	36		10
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	26	చుక్కకూర	3
బోడ కాకర	110		20
బీర	46	తోటకూర	3
దొండ	30		10
పొట్లకాయ	30	గోంగూర	2
చిక్కుడు	56		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	2
క్యాబేజీ	20		10
క్యాలీఫ్లవర్	25	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		30
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	46		20
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	